


రూ. 26 వేల వరకు మిర్చి ధర

కొరిటెపాడు(గుంటూరు): సోమవారం మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం ధర రూ.8వేల నుంచి రూ.26వేల వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 549.60 అడుగుల వద్ద ఉంది. ఔట్‌ఫ్లోగా 21,849 క్యూసెక్కులు విడుదలవుతోంది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదని వైద్య ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన విదేశీ బృందం



మార్టూరు: మండలంలోని కోలలపూడి గ్రామంలో గత కొన్నేళ్లుగా రైతులు, డ్వాక్రా మహిళలు అవలంభిస్తున్న ప్రకృతి సేద్యం పనితీరును నెదర్లాండ్ దేశానికి చెందిన సెర్విన్నా బ్రూస్ బృందం సోమవారం పరిశీలించింది. గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన యూనివర్సిటీని స్థాపించినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ శాఖ బాపట్ల జిల్లా అధికారి వాణిశ్రీ జిల్లాలో ఎంపిక చేసిన మండలాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటల గురించి వివరించారు. రైతులు వెంకటస్వామి, కృష్ణమూర్తి, డ్వాక్రా గ్రూపు మహిళలు మాట్లాడుతూ ముడి సరుకును రాయితీపై అందించి పంటలకు తగిన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

చక్రవర్తికి వంశ వైద్య విభూషణ అవార్డు



వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామంలోని సుధాపాణి నర్సింగ్ హోమ్‌కి చెందిన ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ దివి సీతా రామచక్రవర్తికి జాతీయ స్థాయిలో వంశ వైద్య విభూషణ అవార్డు అందుకున్నారు. చెన్నైలోని గ్రీన్ పార్కు హోటల్లో ఈనెల 24వ తేదీన ఆయుర్వేదిక్ వంశ వైద్య 2023 పురస్కారాలు అందజేశారు. రాష్ట్రం నుంచి వంశ పారంపర్య ఆయుర్వేద వైద్య వృత్తిని నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యులకు పురస్కారాలు అందజేశారు. చక్రవర్తికి ఆయుర్వేద వైద్య విభూషణ్ అవార్డు లభించింది. ఆయుర్వేదోద్ధారక పండిత దివి గోపాలాచార్యులు 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా వేదిక్ హెల్త్ కేర్ సెగ్మెంట్ చెన్నైలో జరిగింది. కార్యక్రమంలో భాగంగా పూణే తిలక్ ఆయుర్వేదిక్ కాలేజీ ప్రొఫెసర్ ఆయుర్వేద త్రిఖండ భూషణ్ డాక్టర్ దిలీప్ గార్గిల్, నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ దివి జయశ్రీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

కడలిలోకి ఆలీవ్ రిడ్లే తాబేళ్లు



చినగంజాం: మత్స్యకారుల జీవనోపాధులు పెంచే కార్యక్రమంలో భాగంగా మత్స్యసంపదను వృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆర్.శ్రీదేవి అన్నారు. బాపట్ల డివిజన్ చీరాల రేంజ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని కుంకుడు చెట్లపాలెం గ్రామ సముద్రతీరంలో ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సముద్రంలోనికి వదలిపెట్టే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా 100 ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి వదలి పెట్టారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వై జాన్సన్, ఎఫ్‌బీఓ నాగమణి, సముద్ర తాబేళ్ల రక్షణ దళం సభ్యులు కారాని శ్రీను, వాటుపల్లి సుబ్బారావు, శ్రీను, తిరుపతిస్వామి, ట్రీ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, ఎస్వీ రమణారెడ్డి పాల్గొన్నారు.

మూల విరాట్‌ను తాకిన సూర్యకిరణాలు



జే.పంగులూరు: మండలంలోని చందలూరులో ఉన్న చెన్నకేశవస్వామి దేవాలయం ప్రసిద్ధి చెందినది. దేవాలయం 15వ శతాబ్దంలో కృష్ణదేవరాయులు వంశస్తుడైన అచార్యుల కాలంలో నిర్మితమైనట్లు శాసనాలు చెప్తున్నాయి. ప్రతి ఏడాదీ సౌరమానం ప్రకారం రెండు పర్యాయాలు సూర్య కిరణాలు నేరుగా మూలవిరాట్‌ని తాకుతాయి. అవి ఉత్తరాయణంలో కుంభ సంక్రమణంలో శతభిషం కార్తెలో అనగా ఫిబ్రవరి 27, 28 తేదీల్లో ఉదయం 6.30 నుంచి 6.55 గంటల వరకు, మరోసారి దక్షిణాయణంలో కన్యా సంక్రమణంలోని అస్త కార్తెలో అక్టోబర్ 14, 15 తేదీల్లో ఉదయం 6.05 నుంచి 6.30 గంటల వరకు సూర్యకిరణాలు నేరుగా మూలవిరాట్‌ను తాకుతాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం చెన్నకేశవ స్వామివారిని నేరుగా సూర్యకిరణాలు తాకాయి.

పండుగలా వ్యవసాయం

రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా సాగుతోంది. గతంలో పెట్టుబడి సాయంలేక.. అప్పు ఇచ్చే దిక్కులేక అన్నదాతలు క్రాప్ హాలిడేలు ఇచ్చే దుస్థితి ఉండేది. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయి.. రైతులు నూతనోత్సాహంతో హలాలు పట్టి పొలాల వైపు సాగుతున్నారు. ప్రతి ఏటా రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించడమే కాకుండా, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారాన్ని సత్వరమే ఇస్తుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నేడు రైతు భరోసా–పీఎం కిసాన్ మూడో విడత అందజేత
- 1,20,689 మంది రైతుల ఖాతాల్లో జమకానున్న రూ.25.93 కోట్లు
- 'మాండూస్' తుపాను నష్టపరిహారం సైతం అందజేత
- 9,771 మంది రైతులకు అందనున్న రూ.9.80 కోట్లు
- నేడు తెనాలిలో బటన్ నొక్కి విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్



సాక్షి ప్రతినిధి, గుంటూరు, కొరిటెపాడు: ఇది వరకు పంట పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేసేవారు. సకాలంలో అప్పు దొరక్కపోతే పంట సాగు చేయలేకపోయేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తుండటంతో రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకుంటున్నారు. వ్యవసాయం పండుగలా సాగుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో రైతులు పడుతున్న కష్టాలను కళ్లారా చూశారు. 2019లో ముఖ్యమంత్రి కాగానే మేనిఫెస్టోలో పొందుపర్చిన నవరత్నాల అమలుకు శ్రీకారం చుట్టారు. అందులో ప్రధానంగా రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకోవాలనే సమున్నత ఆశయంతో 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' అనే సంక్షేమ కార్యక్రమాన్ని గడువుకు ముందుగానే 2019 రబీలోనే అమలులోకి తెచ్చారు. ఏటా ప్రతి రైతు కుటుంబానికి రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఖరీఫ్ కోసం మే నెలలో రూ.7,500, రబీ కోసం అక్టోబర్‌లో రూ.4 వేలు, పంట కోతల సమయం అంటే సంక్రాంతి కానుకగా రూ.2 వేలు.. ఇలా మూడు విడతల్లో నేరుగా రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తున్నారు. 2022 మే నెలలో మొదటి విడతగా రూ.7,500, రెండో విడత కింద గత అక్టోబర్‌లో రూ.4 వేలు చొప్పున పెట్టుబడిసాయం అందజేశారు. ఇక తుది విడతగా సంక్రాంతికి రూ.2 వేలు చొప్పున అందించాల్సి ఉండగా.. ప్రతి రైతుకూ పీఎం కిసాన్ కోసం ఈ–కేవైసీ తప్పనిసరి చేయడంతో కాస్త ఆలస్యంగా మంగళవారం రూ.2 వేలు విడుదల చేయనున్నారు. బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకొని గడువులోపు చెల్లించిన రైతులకు ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తోంది. తుది విడతగా గుంటూరు జిల్లాలోని 18 మండలాల్లోని 1,20,689 మంది రైతులకు రూ.25.93 కోట్ల వరకు మంగళవారం విడుదల చేస్తున్నారు. దీంతో వరుసగా నాలుగో ఏడాది కూడా విజయవంతంగా రైతుల ఖాతాల్లోకి పెట్టుబడిసాయం జమ చేసి భరోసా కల్పించనున్నారు. కేంద్రంతో సంబంధం లేకుండా కౌలురైతులు, అటవీభూములు, దేవదాయభూముల సాగుదారులకు పూర్తి మొత్తం రూ.13,500 రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. వీటితో పాటు జిల్లాలోని 6,070 మంది కౌలు రైతులకు రూ.13,500 చొప్పున రూ.2.23 కోట్లు వారి ఖాతాల్లో జమ కానుంది.

'మాండూస్' నష్టపరిహారం సైతం..

గత ఏడాది డిసెంబర్ మాసంలో మాండూస్ తుపాను వల్ల అధిక వర్షాలు కురిశాయి. జిల్లాలో పలు మండలాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అధిక వర్షాలతో పంటలు దెబ్బతింటే గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ రెండు, మూడేళ్లకు విడుదలయ్యేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు సత్వరం ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా నెల నుంచి రెండు నెలల లోపే ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేస్తోంది. మాండూస్ తుపాను ప్రభావంతో వివిధ మండలాల్లో వరి, మినుము, మిరప, అరటి, కూరగాయల పంటలు 6,582.21 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. పెట్టుబడి రాయితీ కింద రూ.9.80 కోట్లు విడుదల కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెనాలిలోని మార్కెట్ యార్డు ఆవరణలో రైతు భరోసా–పీఎం కిసాన్ నగదు, మాండూస్ తుపాను వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేయనున్నారు.

సన్న, చిన్నకారు రైతులకు ఎంతో మేలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను రైతులకు నేరుగా అందిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీనివల్ల సన్న, చిన్నకారు రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టపోయిన రైతులకు కూడా ఏ సీజన్‌కు సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీని ఆ సీజన్‌లో అందిస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్.

– మెరిగల సుందరరావు, రైతు, కాకుమాను



ఏర్పాట్లు పరిశీలిస్తున్న గోపాలకృష్ణ ద్వివేది, హరికిరణ్, కలెక్టర్ , తలశిల, శివకుమార్ తదితరులు

రైతు బాంధవుడి రాకకోసం..

- ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం
- పకడ్బందీగా ఏర్పాట్లు

తెనాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెనాలి–నారాకోడూరు రోడ్డులో గల కవిరాజనగర్‌లో హెలిప్యాడ్ నిర్మాణం పూర్తిచేసి, అక్కడకు దగ్గర్లోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్మించిన బహిరంగ సభావేదిక వద్దకు సోమవారం సాయంత్రం ట్రయల్ రన్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మరోసారి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ నేతృత్వంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. సీఎం పర్యటన సందర్భంగా మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

- మార్కెట్ యార్డు నుంచి కవిరాజనగర్‌లోని హెలిప్యాడ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా బ్యారికేడ్లు నిర్మించారు. ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అనుమతులు లేవు.
- మార్కెట్ యార్డులోని ఇన్‌గేట్ ద్వారా సీఎం కాన్వాయ్ లోపలకు ప్రవేశించి బహిరంగ సభావేదికకు చేరుకుంటుంది. మార్కెట్‌యార్డు ఔట్‌గేట్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో యార్డు లోపలకు తాత్కాలికంగా ఏర్పాటుచేసిన రహదారి, ప్రభుత్వ ఆసుపత్రి పక్కనుంచి ఇప్పటికే ఉన్న రహదారి...అంటే మూడు మార్గాల్నుంచి రైతులు, సాధారణ ప్రజలు, సందర్శకులను అనుమతించనున్నారు.

సీఎం హోదాలో తొలిసారి తెనాలికి..

రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటిసారి తెనాలి రానుండగా ఘనస్వాగతం పలికేందుకు తెనాలి ప్రాంత రైతాంగం, సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉవ్విళ్లూరుతున్నారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో కొల్లిపర జడ్పీటీసీ, ప్రస్తుత జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టీనా, కత్తెర సురేష్‌కుమార్ దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బహిరంగ సభ ఏర్పాట్లు...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి పర్యటన సజావుగా కొనసాగేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రైతు భరోసా కేంద్రాల ముఖ్య కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది సూచించారు. వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్‌తో కలిసి ముఖ్య కమిషనర్ ద్వివేది సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డుకు వచ్చారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. వ్యవసాయశాఖ ఎగ్జిబిషన్, గ్యాలరీ ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌తో సహా కవిరాజనగర్‌లే అవుట్ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌ను సందర్శించి, తగిన సూచనలు చేశారు.

సత్వరమే అర్జీల పరిష్కారం

జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు



అర్జీలు పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

బాపట్లఅర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన గృహాలను నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు, పౌర సరఫరాల శాఖ డీఎం శ్రీలక్ష్మి, డీఎస్‌ఓ విలీమ్స్ పాల్గొన్నారు.

22–ఏలో నుంచి తీసివేయండి

నాకు కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఐదెకరాల భూమి ఉంది. ఆ భూమి 22–ఏలో పడింది. దీని మీద కోర్టుకి వెళ్లగా మాకు న్యాయం జరిగింది. అయినా అధికారులు 22–ఏలో నుంచి తీయకుండా ఇబ్బంది పెడుతున్నారు. న్యాయం చేయాలి.

– రాయశ్ల వెంకటేశ్వర్లు, స్వర్ణ గ్రామం

నా ఇంటిని ఆక్రమించుకుంది

రేపల్లె పట్టణంలో ఉప్పూడి –2 సచివాలయం పరిధిలోని నాకు చెందిన రేకుల షెడ్డును చుండూరు ప్రమీల ఆక్రమించుకుంది. నా ఇంటిని నాకు అప్పగించి న్యాయం చేయండి.

– చుండూరు వసంతరావు, రేపల్లె పట్టణం

దూసుకొచ్చిన మృత్యువు

- రవాణా వాహనంతో లింక్ తెగి.. కూలీల ఆటోపైకి దూసుకొచ్చిన జనరేటర్ బండి
- ఘటనా స్థలంలో ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం
- మరో ఎనిమిది మంది మహిళలకు తీవ్ర గాయాలు
- మిర్చి కోతలకు వెళ్తుండగా గరువుపాలెం వద్ద ఘటన



మరణించిన పిట్టు వెంకటరమణ, తుమ్మా సాంబ్రాజ్యంలు

చేబ్రోలు: రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద మహిళా కూలీలు... మిర్చి కోతల కోసం ఆటోలో బయలు దేరి మార్గమధ్యలో ప్రమాదానికి గురవటంతో విషాదం అలుముకుంది. చుండూరు మండలం దుండిపాలెం గ్రామానికి చెందిన 14మంది మహిళా కూలీలు సోమవారం ఉదయం ఆటోలో చేబ్రోలు మండలం నారాకోడూరులో మిర్చి కోతల కోసం బయలు దేరారు. మార్గ మధ్యలో వడ్లమూడి గరువుపాలెం చాణక్య హైస్కూల్ ఎదురుగా తెనాలి రోడ్డులో ఎదురుగా జనరేటర్‌ను తీసుకొని వస్తున్న ఒక రవాణా వాహనం కూలీల ఆటోను ఢీ కొట్టింది. రవాణా వాహనం జనరేటర్‌ను తీసుకువస్తున్న లింక్ ప్రమాదవశాత్తూ ఊడిపోయి జనరేటర్ అదుపుతప్పి ఆటోపై దూసుకెళ్లింది. దీంతో ఆటో నుజ్జు నుజ్జు అయింది. దీనితో పాటు వెనుక వస్తున్న కారును ఢీ కొట్టి జనరేటర్ దాని మీద పడి నిలిచి పోయింది. ఈ సంఘటనలో ఇరువురు మహిళా కూలీలు అక్కడక్కడే మరణించారు. తొమ్మిది మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. చుండూరు మండలం దుండిపాలెం గ్రామానికి చెందిన పిట్టు వెంకటరమణ(46), తుమ్మా సాంబ్రాజ్యం (30) సంఘటనా స్థలంలోనే అక్కడక్కడే మరణించారు. వీరితో పాటు లంకా లక్ష్మి, క్రీస్తు కుమారి, దుర్గ, జంగం మరియమ్మ, లక్ష్మీ తిరుపతమ్మ, డి.మరియమ్మ, బహుతుల్లా, మణెమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చేబ్రోలు 108 వాహనంలో సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న మణెమ్మ, మరియమ్మలను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు పిట్టు వెంకటరమణ భర్త కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్‌ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.

జనరేటర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం..

చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో ఆదివారం మారెమ్మతల్లి తిరునాళ్లను నిర్వహించారు. తిరునాళ్ల అయిపోవటంతో ఉదయం తెనాలికి జనరేటర్‌ను చేర్చటం కోసం రవాణావాహన డ్రైవర్ దాన్ని వాహనానికి కట్టుకొని తెనాలి బయలు దేరాడు. డ్రైవర్ అలసత్వంతో వాహనానికి కట్టిన లింక్ సక్రమంగా లేకపోవటంతో ఊడిపోయి మహిళా కూలీల పాలిట జనరేటర్ మృత్యుశకటంగా మారింది.

సెల్ వల.. విలవిల



- సెల్‌ఫోన్‌తో జరభద్రం గురూ...!
- అపరిచిత నెంబర్ నుంచి వీడియో కాల్ వస్తే ఎత్తకండి
- నగ్న వీడియో కాల్‌తో హనీట్రాప్
- ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులే టార్గెట్
- అధికారిక నంబర్లకే ఫోన్లు

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. ఏ విధంగా మోసపోయినా వెంటనే పోలీసులను ఆశ్రయిస్తే బాధితులకు న్యాయం జరుగుతుంది. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులు అయినా రిమాండ్‌కు పెడుతున్నాం. జరిగిన నేరాలు వెంటనే పోలీసుల దృష్టికి రావడం లేదు. పోలీసులను ఆశ్రయిస్తే ఖచ్చితంగా న్యాయం జరుగుతుంది.

– ఆరిఫ్ హఫీజ్, జిల్లా ఎస్పీ

నేడు సెల్‌ఫోనే ప్రపంచం అయిపోయింది. నగదు లావాదేవీల నుంచి అన్నీ ఫోన్‌లోనే నడిచిపోతున్నాయి. సోషల్ మీడియా ఖాతాల ద్వారా మనం అందరికీ పరిచయం అవ్వడమే కాకుండా మోసగాళ్ల చేతుల్లోకి కూడా వెళ్లిపోతున్నాం. మన ఫొటోలను ఉపయోగించుకుని దొంగ అకౌంట్ల ద్వారా డబ్బులు వసూలు చేసుకుంటున్నవారు కొందరైతే, ఆ ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్న వారు మరికొందరు. ఆన్‌లైన్ మోసాలలో బాధితులందరూ ఉన్నత విద్యావంతులు కావడం గమనార్హం. - సాక్షి ప్రతినిధి, గుంటూరు

ఇంటికి వచ్చి రిలాక్స్ అయ్యి పడుకోవడానికి సిద్ధం అయ్యే సమయంలో వాట్సాప్‌కు ఒక వీడియో కాల్ వస్తుంది. ఎవరా అని మనం అటెండ్ చేస్తే అటు వైపు ఉన్నవారు నగ్నంగా ఉంటారు. వారు నగ్నంగా ఉన్నారని మనకు అర్థం అయ్యి కాల్ కట్ చేసేసరికి ఐదు నుంచి పది సెకన్లు సమయం పడుతుంది. మనం కాల్ కట్ చేసిన తర్వాత వేరే నెంబర్ నుంచి వెంటనే వీడియోకాల్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్ వస్తుంది. మీరు న్యూడ్ కాల్ మాట్లాడారు. ఈ ఫొటోలను మీకు సంబంధించిన అన్ని వాట్సాప్ గ్రూపుల్లో పెడతామంటూ బెదిరింపులకు దిగుతారు. భయపడి లొంగితే ఐదు వందల నుంచి ప్రారంభించి లక్షల రూపాయలు వసూలు చేస్తూనే ఉంటారు. ఈ కాల్స్ అన్ని ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నతాధికారులే టార్గెట్‌గా వస్తున్నాయి. ప్రభుత్వ నెంబర్‌కే ఈ ఫోన్లు వస్తుండటం గమనార్హం. గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకూ ఇటువంటి ఘటనలు 50కి పైగా నమోదు అయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ న్యూడ్ కాల్స్ బాధితులు వెంటనే పోలీసులను ఆశ్రయించకపోవడం, ఫిర్యాదు చేయడానికి ఇష్టపడకపోవడం వల్ల ఇప్పటి వరకూ ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. వారికి స్క్రీన్‌షాట్ రాగానే భయంతో డిలీట్ చేసేస్తున్నారు. దీంతో ఫిర్యాదు చేసి వాట్సాప్ బ్లాక్ చేసే అవకాశం కూడా ఉండటం లేదు.

అధికారుల పేరుతో వాట్సాప్ మెసేజ్‌లు



జిల్లాలోని ఉన్నతాధికారులు తమ వాట్సాప్ డీపీగా పెట్టుకున్న ఫొటోనో, లేకపోతే పత్రికల్లో వచ్చిన ఫొటోలనో తీసుకుని మోసగాళ్లు కొత్త మోసాలకు తెరలేపారు. సదరు అధికారి ఫొటోను తమ డీపీకి పెట్టుకుంటారు. జిల్లాస్థాయి అధికారులు గానీ, అదే విభాగానికి చెందిన కింది స్థాయి అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లు సంపాదిస్తారు. వారు ఆఫీసుకు బయలుదేరే బిజీలో ఉన్నప్పుడు వారికి సదరు అధికారి డీపీ ఉన్న ఫోన్ నుంచి మెసెజ్ వస్తుంది. ఇది నా వ్యక్తిగత నెంబర్, అర్జెంట్‌గా వేరేవారికి ఇవ్వడానికి గిఫ్ట్‌కార్డులు కావాలి. నాకు పంపండి అంటారు. తమ ఉన్నతాధికారి అడిగారన్న భావనలో వారు వేల రూపాయల ఖర్చుతో ఈ గిఫ్ట్‌కార్డులు కొని పంపుతున్నారు. పంపగానే ఆ మొత్తాన్ని రీడీమ్ చేసుకుని సిమ్ స్విచ్ ఆఫ్ చేసేస్తున్నారు.

నగరంలో ఒక కేసు నమోదు..

ఇటీవల పట్టాభిపురంలో ఒక కేసు నమోదు అయ్యింది. రాష్ట్రానికి చెందిన మ్యాట్రిమోనీ సంస్థ ద్వారా పరిచయం అయిన ఒక వ్యక్తి పెళ్లి అయిన తర్వాత ఉండటానికి ఒక విల్లా కొందామని, పెళ్లి ఖర్చులకి డబ్బుల పేరుతో రూ.25 లక్షల వరకూ వసూలు చేశాడు. మొత్తం డబ్బులు తానే ఇస్తానని, ఒక్కసారిగా అంత మొత్తం బదిలీ చేయాలంటే ట్యాక్స్ పడుతుందంటూ వారిని నమ్మించాడు. అయితే విల్లా కొనడానికి వెళ్లిన సమయంలో ఆ బిల్డర్‌కు అతని వ్యవహారశైలిపై అనుమానం రావడంతో బాధితులకు చెప్పి వారితో ఫిర్యాదు చేయించాడు. దీంతో మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి డబ్బులు వెనక్కి ఇప్పించడమే కాకుండా రిమాండ్‌కు పంపించారు.



పెళ్లి పేరుతో మోసాలు....

పెళ్లి పేరుతో మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో పరిచయం అయ్యి పెళ్లి చేసుకుందామని నమ్మించి మోసం చేస్తున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది. విదేశాల్లో ఉన్నానని పరిచయం చేసుకుంటారు. బాగా ఖరీదైన గిఫ్ట్ పంపుతున్నానని నమ్మిస్తారు. తర్వాత ఆ గిఫ్ట్ ఎయిర్‌పోర్టులో ఆగిపోయిందని, దానికి ట్యాక్స్ కట్టాలంటారు. తర్వాత కస్టమ్స్ డ్యూటీ అని, జీఎస్‌టీ అని అవి ఇండియన్ కరెన్సీలో కట్టాలని చెబుతారు. అందులో డాలర్లు ఉన్నాయని, వాటిని మార్చాలనిదానికి కొంత డబ్బులు అవుతాయని పెళ్లి వాళ్ల నుంచి వసూలు చేస్తున్నారు. ఖరీదైన గిఫ్ట్ అన్న ఆశతో ఇవతల వాళ్లు కూడా స్పందిస్తున్నారు. దీని కోసం యూకే, దుబాయ్ నెంబర్లను డార్క్‌వెబ్‌లో కొన్ని ఉపయోగిస్తున్నట్లు సమాచారం.

హైటెక్ పాదయాత్రలతో లోకేష్ అభాసుపాలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లెరూరల్: హైటెక్ పాదయాత్రలు చేస్తూ అభాసు పాలవుతున్న లోకేష్ సభ్యత, సంస్కారాలను మరచి తనకు ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం తగదని రాజ్య సభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలం లోని బేతపూడి గ్రామంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బైక్‌లపై పర్యటించటం పాదయాత్ర ఎలా అవుతుందో లోకేష్ చెప్పాలన్నారు. పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకోకుండా ప్రభుత్వాన్ని విమర్శించటమే ధ్యేయంగా మాట్లాడుతున్నారన్నారు. నవరత్న పథకాలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉంటే చంద్రబాబు, లోకేష్‌లు ఓర్వలేకపోతున్నారని అన్నారు. పేదవానికి సాయం చేయాలన్న ఆలోచన సీఎం జగనన్నదైతే దానిని అడ్డుకోవాలన్న ఆలోచన చంద్రబాబుదన్నారు. రాష్ట్రంలో పథకాలు అమలవటంలేదని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించటంలేదని లోకేష్ పదేపదే ప్రస్తావించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సచివాలయాల ద్వారా 2లక్షల మందికిపైగా శాశ్వత ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పలు కార్పొరేట్ సంస్థల ద్వారా రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇవేవి లోకేష్‌కు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలులాగా కనబడటం లేదా అని ప్రశ్నించారు? రాష్ట్రంలో ఉనికిని కోల్పోతున్న తెలుగుదేశం పార్టీని చంద్రబాబు, లోకేష్‌లను ఎల్లోమీడియా ఎంతో హైలెట్ చేయాలని ప్రయత్నిస్తున్నా ఉపయోగం ఉండటం లేదన్నారు. లోకేష్ ఎన్ని పాదయాత్రలు చేసినా చంద్రబాబునాయుడు ఎన్ని సభలు నిర్వహించినా రాష్ట్ర ప్రజలు వారిని నమ్మే పరిస్థితిలేదన్నారు. 2024లో మరోమారు జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్ ఆలూరి పద్మ, ఎంపీటీసీ సభ్యురాలు కొమరాబత్తుని జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోలాటానికి కేరాఫ్ చెన్నుపల్లి

- 26 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శనలు
- టీటీడీ హిందూ ధర్మ ప్రచారకుడిగా సేవలు
- పలు సంస్థల నుంచి అవార్డులు ప్రశంసలు


గజ్జెకట్టి పాటపాడుతున్న నాగేశ్వరరావు

అద్దంకి రూరల్: ఆయనకు కోలాటమే శ్వాస, కళను బతికించడమే ఆశయం. జానపద కళారూపాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన కోలాట ప్రదర్శనకు కేరాఫ్ అడ్రస్‌గా అద్దంకికి చెందిన చెన్నుపల్లి నాగేశ్వరరావు నిలుస్తున్నాడు. అద్దంకి పరిసర ప్రాంతాలతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన వేలాది మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చి వారిచే ప్రదర్శనలు ఇప్పిస్తున్న గురువు నాగేశ్వరరావు.

26 ఏళ్లుగా కోలాటం, బృందావన భజన

అద్దంకిలోని సామాన్య కుటుంబంలో జన్మించిన చెన్నుపల్లి నాగేశ్వరరావు చిన్నతనం నుంచి జానపద కళలపై అమితమైన ఆసక్తి. దీంతో ఆయన మండలంలోని శింగరకొండపాలెం గ్రామానికి చెందిన రాచపూడి దాసు మాస్టర్ వద్ద కోలాటంలో శిక్షణ పొందాడు. మంచి గాత్రం కలిగిన నాగేశ్వరరావు అందరి మన్ననలు పొందాడు. 26 ఏళ్ల నుంచి విరామం లేకుండా జిల్లాలో నిర్వహించే ప్రతి సాంస్కృతిక వేడుకల్లో కోలాటం, బృందావన భజనను ప్రదర్శిస్తున్నాడు.

ఇప్పటి వరకు 46 వేలమంది శిష్యులను తయారుచేసి 960 భజనా సమాజాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామాల్లో నిర్వహించిన సాంస్కృతిక వేడుకల్లో కోలాట ప్రదర్శనలు ఇచ్చారు. తమిళనాడులోని శ్రీపురం (స్వర్ణ దేవాలయం), చెన్నై, కర్ణాటక, ఉడిపి, బెంగళూరు, న్యూఢిల్లీ, ఉత్తరాంచల్, హృషికేష్‌లలో 2500 వరకు ప్రదర్శనలు ఇచ్చారు. కోలాటంలో నిత్యం బిజీగా ఉన్నా ధర్మప్రచార కర్తగా ధర్మ ప్రచారం నిర్వహిస్తున్నారు. ధర్మ ప్రచారంలో భాగంగా అద్దంకిలో ప్రముఖ వాగ్గేయకారులు అన్నమాచార్య, పురంధరదాసుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. దైవ కార్యక్రమాలు, ధర్మ ప్రచారాన్ని నిర్వహిస్తున్న తన తోటి కళాకారులకు ఆపద వస్తే ఆదుకుంటున్నారు. కరోనా సమయంలో 200 పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు అందజేశారు. తోలు బొమ్మలాట కళాకారుడుకి ఆర్థిక సహాయం, పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.

అవార్డులు ప్రశంసలు

26 ఏళ్లుగా కోలాట ప్రదర్శనలు ఇస్తున్న చెన్నుపల్లి నాగేశ్వరరావు ఎన్నో బహుమతులు, అవార్డులు, ప్రశంసలు పొందారు. 2012లో రాంకీ ఫౌండేషన్ నిర్వహించిన ప్రపంచ తెలుగు మహోత్సవాల్లో నిర్వహించిన కోలాట ప్రదర్శనకు ప్రథమ బహుమతి, 2013 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలో తన ప్రదర్శనకు ప్రథమ బహుమతి అందుకున్నారు. 2021లో ముండ్లమూరు కోలాట సమాజం వారు భక్తి పూర్వకంగా రజిత గండపెండేరాన్ని సమర్పించారు.

చీరాల గ్రూప్ టెంపుల్స్ అధికారిగా జీవీఎల్‌కు బాధ్యతలు

చీరాల అర్బన్: చీరాల గ్రూప్ టెంపుల్స్ ఎండోమెంట్ అధికారిగా ఉన్న టీవీ శివనాగదాసు కొంత కాలంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను ఎండోమెంట్ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సంతరావూరులో గ్రూప్ టెంపుల్స్ ఎండోమెంట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న జీవీఎల్ కుమార్‌కు చీరాల గ్రూప్ టెంపుల్స్ ఎండోమెంట్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ఎండోమెంట్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సోమవారం ఆయన బాపట్ల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తాము చేసిన పోరాటానికి ఫలితం దక్కిందని చీరాల శివాలయ కమిటీ ప్రతినిధులు స్వర్ణ మల్లికార్జున ప్రసాద్, మురళి, బుర్ల రాము తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వెదురు బొంగులతో అలంకరణ వస్తువులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సీఎస్ఆర్, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, ఫైన్‌ఆర్ట్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వెదురు బొంగులతో అలంకరణ వస్తువుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఉజ్వల హోంలో ఉండే మహిళలు, బాలికల ఉన్నతికి తోడ్పడే శిక్షణ కార్యక్రమాలు, సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎస్ఆర్ కో-ఆర్డినేటర్ ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, ఉజ్వల హోం ప్రతినిధులు సిస్టర్ రోజ్‌లీనా, సిస్టర్ రాణి, సిస్టర్ పునీత, సిస్టర్ రూప పాల్గొన్నారు.

మహిళపై లైంగికదాడి కేసులో నిందితుడు అరెస్ట్


మాట్లాడుతున్న ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ

చినగంజాం: మహిళను భయభ్రాంతులకు గురిచేసి అత్యాచారం చేసిన ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌లో సోమవారం సీఐ వీ సూర్యనారాయణ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన కానూ చరణ్ పట్నాయక్ ఇంకొల్లు ఎన్ఎస్ఎల్ కంపెనీలో మొబిలైజర్‌గా పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో పని కోసం వచ్చిన అదే రాష్ట్రానికి చెందిన ఓ మహిళను గతేడాది డిసెంబర్ 19న ఫొటోలు తీయించే నిమిత్తం తన కారులో బయటకు తీసుకువెళ్లి ఇంకొల్లు నుంచి చీరాల వెళ్లే మార్గంలో గొల్లపాలెం గ్రామ సమీపంలో ఒక నిర్మానుష్య ప్రదేశంలో కారు ఆపాడు. మహిళపై దాడిచేసి బెదిరించి బలవంతంగా లైంగికదాడి చేశాడు. అక్కడి నుంచి మహిళను అదే కారులో కంపెనీలో దించి, అత్యాచారం విషయం ఎవరికైనా చెబితే ఉద్యోగం తీయించి చంపేస్తానని బెదిరించి పరారయ్యాడు. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు అత్యాచారం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ, ఎస్సై ఎస్కే నాయబ్ రసూల్ సిబ్బంది సాయంతో నిందితుడు కానూ చరణ్ పట్నాయక్‌ను సోమవారం మధ్యాహ్నం ఇంకొల్లు పావులూరు రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపం వద్ద అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి కారును స్వాధీనం చేసుకొని పర్చూరు కోర్టులో హాజరుపరచారు. నిందితుడుకి శిక్ష పడేలా చేసి బాధితురాలికి న్యాయం చేస్తాం అని సీఐ తెలిపారు. కేసులో ప్రతిభ కనబరచిన సీఐ, ఎస్సై సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

కృష్ణా నదిలో దూకి ఓ తల్లి ఆత్మహత్య

తాడేపల్లి రూరల్: ఓ కన్న తల్లి తన కొడుకు వివాహం చేసుకోవడం లేదని మనస్తాపం చెంది కొడుకుతో గొడవపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాడేపల్లి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. మంగళగిరి మురుగుడు హనుమంతరావు కాలనీకి చెందిన ఆకురాతి వెంకటరమణమ్మ(45) తన చిన్న కుమారుడు లక్ష్మణ్ వివాహం చేసుకోవడం లేదని మనస్తాపం చెంది కొడుకుతో గొడవపడి ఇంట్లో నుంచి ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బయటకు వెళ్లింది. అప్పటి నుంచి పెద్ద కొడుకు రాము, చిన్న కుమారుడు లక్ష్మణ్ బంధువుల ఇళ్లలోను, ఇతర ప్రాంతాల్లో ఎంక్వయిరీ చేశారు. ఎటువంటి సమాచారం లభించలేదు. సోమవారం ఉదయం కృష్ణానది దిగువ ప్రాంతంలోని సీతానగరం పుష్కర ఘాట్ల సమీపంలో రైల్వే బ్రిడ్జి కింద మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీసి సమాచారం కోసం మహిళా పోలీసుల గ్రూపులో వెంకటరమణమ్మ మృతదేహం ఫొటోను పోస్ట్ చేశారు. మంగళగిరి మహిళా పోలీసులు వెంకటరమణమ్మగా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్పందన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఎస్పీ వకుల్ జిందాల్


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల: స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన 43 ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలు తమ బాధలు, సమస్యలను స్వేచ్ఛగా జిల్లా ఎస్పీ విన్నవించుకొని అర్జీలు అందజేశారు. వాటిలో భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నవి. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులు నిర్దిష్ట గడువులోపు పరిష్కరించి, ఫిర్యాదిదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలన్నారు. స్పందన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

OFFICE OFTHE SUPERINTENDENT :: GOVT. GENERAL HOSPITAL :: GUNTUR.
Rc.No.1581/HDS/2021-23 Dt.27.02.2023
TENDER NOTICE
Sealed Tenders are invited for supply of Diet to the In-patients & Duty Doctors in Government General Hospital, Guntur for initial period of 2 (two) years and extendable for further one year, if the District Diet Management Committee, (GGH Guntur) satisfied with the service of the Contractor. For Terms & Conditions and Tender Schedule for supply of Diet has to be obtained on payment of Rs.7,000/- Application fee in the Counter of Hospital Development Society, GGH Guntur.
Sale of Tender Forms : From 01.03.2023 to 13.03.2023 up to 02:00 PM
Last date for receipt of Sealed Tenders : 14.03.2023 up to 05:00 PM
Opening of Tender : 17.03.2023 at 03:00 PM in the chambers of the Joint Collector, Guntur District
Sd/- Dr. N.Prabhavathi, SUPERINTENDENT, Member Convenor, District Diet Management Committee, Govt. General Hospital, Guntur
Sd/- G.Raja Kumari, IAS, Joint Collector & Chairman, District Diet Management Committee, Guntur District.

బాలిక కిడ్నాప్ కేసులో ఐదేళ్ల జైలు

- వెయ్యి జరిమానా
- తీర్పునిచ్చిన జిల్లా పోక్సో కోర్టు జడ్జి రామకృష్ణారావు

నాదెండ్ల: బాలికను కిడ్నాప్ చేసి, అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి పోక్సో చట్టం కింద ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ఎస్ఐ ఆవుల భాస్కర్ తెలిపిన వివరాలు... పొనుగుపాడు గ్రామానికి చెందిన జక్కుల అనిల్‌కుమార్ పాస్టర్‌గా వ్యవహరిస్తూ చర్చిని నడుపుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక అతడి చర్చికి వెళ్తుండేది. అయితే బాలికతో అనిల్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలియడంతో బాలికను ఆమె తండ్రి తూబాడు గ్రామంలోని ఆమె అమ్మమ్మ ఇంటికి పంపాడు. తూబాడు గ్రామంలో బాలిక ఉందని తెలుసుకున్న అనిల్‌కుమార్ 2017, జూలై 23న కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక జాడ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడు అనిల్ కుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపారు. పల్నాడు జిల్లా పోక్సో కోర్టు జడ్జి రామకృష్ణారావు సోమవారం నిందితుడికి పై శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రస్తుత సీఐ వై.అచ్చయ్య, ఎస్ఐ ఎ.భాస్కర్‌లు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి కేసు విచారణ వేగంగా పూర్తయ్యేందుకు సహకరించారు.

ముగిసిన తైక్వాండో పోటీలు


క్రీడాకారులను అభినందిస్తున్న బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు తదితరులు

రేపల్లె: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ వారిచే పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కే.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తైక్వాండో క్రీడాకారులకు నాలుగు విభాగాలలో పోటీలు నిర్వహించగా పోటీలలో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. వీరిలో ప్రథమ స్థానంలో రేపల్లె పట్టణానికి చెందిన కింగ్స్‌వే అకాడమీ క్రీడాకారులు నిలిచారని, వారు 20 బంగారు, 12 రజత, 15 కాంస్య పతకాలను సాధించారని చెప్పారు.

చింకపాలెం జెడ్పీహైస్కూలు క్రీడాకారులు 14 బంగారు, 9 రజత, 6 కాంస్య పతకాలు సాధించి ద్వితీయ స్థానంలో నిలవగా, తెనాలికి చెందిన సీఎంసీ ఫిట్‌నెస్ జోన్ తైక్వాండో క్లబ్ క్రీడాకారులు 6 బంగారు, 2 రజత పతకాలు సాధించి తృతీయస్థానంలో నిలిచారన్నారు. పోటీలలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు మార్చి 10వ తేదీన విశాఖపట్నం జిల్లా యలమంచలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొని విజేతలకు పతకాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■10th, ఇంటర్(ఒకేసం॥లో), డిగ్రీ(1-3సం॥లో) BA, BCom, BSc, MA, MCom, MBA, MSc (All Groups) పాస్ గ్యారంటీ శిక్షణ, సంప్ర॥శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్, 2/11 బ్రాడీపేట.Gnt 8008145999

REAL ESTATE
PLOT FOR SALE
■గుంటూరు A.T.అగ్రహారం 14వలైనులో 375 చ॥గజాల స్థలం కొలతలు(26 x130) గల ప్లాట్ అన్ని సౌకర్యములతో అమ్మబడును. సంప్ర॥ 9848478154
■గుంటూరు కార్పొరేషన్‌లోని గోరంట్ల నందు బొడ్డురాయి సెంటర్ దగ్గర ఇళ్ళమధ్యలో 590 చ॥గ॥ స్థలం మొత్తంగాని, విడివిడిగా గాని అమ్మ బడును 9701956585
LEASE/ SALE
■తెనాలి బుర్రిపాలెంరోడ్‌లో గుప్తాకాలేజి వద్ద 1 ఎకరం విస్తీర్ణంలో నెలకొల్పబడిన మనోప్రకాష్ మానసిక చికిత్సాలయం మొత్తంగా/ విడివిడిగా అమ్మకం/ అద్దెకు. 9440220551, 8500514024

SERVICES
■వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేకోవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా ఋణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237

BUSINESS OFFER
■ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9094974058

GOLD FINANCE
■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299
■బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్, సంప్ర॥ 96590 57777
■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521
■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999

■సంప్ర. సెల్: 79977 89771, బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. (100% జెన్యూన్)

MARRIAGE SERVICES
■రెడ్డి,నాయుడు, క్రిస్టియన్ పెళ్ళిసంబంధములకై డాక్టర్లు, సాఫ్ట్‌వేర్, ఉద్యోగులు, ప్రైవేట్ జాబ్స్, డిగ్రీ వరకు సంబంధములు చూడబడును.సంప్ర॥M.Rama rao A.T.అగ్రహారం,4వలైను, గుంటూరు 9490639640

WANTED
■గుంటూరు ఆటోనగర్‌లోని పెట్రోలు బంకు నందు పనిచేయుటకు పంప్‌బాయ్స్ & గాల్స్ కావలెను. డే డ్యూటి/నైట్ డ్యూటి మంచి జీతం సంప్ర॥ 7799689889, 8074548302
■Wanted Male Administrative Officers Qualification Any Degree / B.Tech Must be Married. Salary: 25,000/- place of work Guntur. Master Minds. Contact: 9100024059
■ఇంటిపని చేయుటకు ఆడమనిషి కావలెను. గుంటూరులో శాఖాహారులు ఇంట్లోనే ఉండి ఇంటి పనిచేయుటకు ఏ బాదరబందీలేని ఒంటరి మహిళ కావలెను. తెలుగు చదవటం, వ్రాయటం వచ్చి ఉండవలెను. ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పించబడును. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వివరములకై సంప్రదించవలసిన ఫోన్ నెం: 9010299252
■ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509588
■అతి తక్కువ పెట్టుబడితో కంపెని నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి క్రొత్త రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ : 7730899503
■తెనాలిలోని ప్రముఖ వి.కార్డియాక్ హాస్పిటల్ నందు పనిచేయుటకు అంబులెన్స్ డ్రైవర్, నర్సింగ్ స్టాఫ్, మేల్ ఫార్మాసిస్ట్ కావలెను. అనుభవం బట్టి మంచిజీతం. 08644-355799/ 7095220001
■మంగళగిరి : ప్రముఖ దంత వైద్యశాల నందు పనిచేయుటకు అసిస్టెంట్ కావలెను. సంప్ర॥ 8374621551
■ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు వార్డు బాయ్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 11000/-. సంప్ర॥ 8297528440, 8309062183
■ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన వరకు జీతం. మరిన్ని వివరాలకు సంప్ర : 90631 32743

■నరసరావుపేట, యలమందలో ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్వైజర్, గార్డ్స్ (బ్రౌన్సర్స్) కావలెను. డ్యూటీ 8, 12 గం॥, జీతం: 11,000, 10,500/- PF, ESI రూమ్ + భోజన సౌకర్యం. ✆ 99859 56778
■మార్టూరు శ్రీ శారదానికేతన్ పబ్లిక్ స్కూల్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన అడ్మిన్ ఆఫీసర్, వంటవారు (1+1) కావలెను ✆ 91004 63624
■ఆకాశ ఎయిర్‌లైన్స్‌లో వర్క్ చేయుటకు ఎయిర్ క్యాబిన్ సూపర్‌వైజర్స్, టీం లీడర్స్, సూపర్‌వైజర్స్, కస్టమర్ సర్వీస్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను. Qly: 10th-డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, జీతం: 23,000/- To 29,000/- రూం + ఫుడ్ ఫ్రీ. వ: 18-35 సం॥, ✆ 8885017984.
■మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి8500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520
■ప్రముఖ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లో కార్గో లోడర్స్, హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను, జీతం: 22000/- ఆపైన, వ: 18-35, రూమ్+ భోజనం ఫ్రీ. ఫోన్ : 8888186894.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
97034 67843
97030 13015
92904 02000

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ట్రాక్టర్ ఢీకొని కార్మికుడు దుర్మరణం

చీరాల: ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. పనికి వెళ్లి ఇంటికి వస్తున్న కార్మికుడిని ట్రాక్టర్ వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పేరాల జక్కావారి వీధికి చెందిన గుంటి సోమసుందర్ (45) ఐటీసీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం విధులు ముగించుకుని బాపట్ల వెళ్లాడు. రాత్రి సమయంలో తిరిగి పేరాల వస్తుండగా ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్ సమీపంలో ధాన్యం లోడుతో అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ప్రమాదంలో సోమసుందర్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈపూరుపాలెం ఎస్ఐ జనార్దన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. నెల కిందటే మృతుడు పెద్ద కుమార్తెకు వివాహం చేయగా మిగిలిన ఇద్దరు కుమార్తెలు చదువుకుంటున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరు అవుతోంది.

జగనన్న లేఅవుట్‌లో చోరీ

రూ.5 లక్షల విలువైన సిమెంట్, ఇనుము మాయం

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామంలో నిర్మాణాలు జరుగుతున్న జగనన్న లేఅవుట్‌లో ఆదివారం అర్ధరాత్రి చోరి జరిగింది. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో గమనించిన స్థానికులు లబ్ధిదారులను అప్రమత్తం చేశారు. 15 మంది లబ్ధిదారులకు చెందిన 6,10,12 మిల్లీమీటర్ల పరిమాణం గల 525 ఇనుప చువ్వలు, 20 సిమెంట్ బస్తాలు, దర్వాజాలు, ఇనుప స్టాండులు, తడికలు చోరీకి గురైనట్లు గుర్తించినట్లు బాధితులు తెలిపారు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. గత మూడు నెలల కిందట ఇదే కాలనీలో విద్యుత్ ప్యానెల్ బోర్డులు ఇతర సామగ్రి చోరీకి గురయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, ఇప్పుడైనా నిందితులను గుర్తించి తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యాదవరాజుల సత్రం అభివృద్ధికి చర్యలు

రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని శ్రీ ఆనందవల్లి యాదవరాజుల అన్నదాన సత్రం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు. అన్నదాన సత్రం మూడో అంతస్తుకు శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీద మస్తాన్‌రావు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్రం అధ్యక్షుడు కొక్కెర శ్రీనివాసయాదవ్, ఉపాధ్యక్షుడు బూర్ల సాంబశివరావు యాదవ్, కార్యదర్శి గండికోట శ్రీనివాస యాదవ్, కోశాధికారి బొమ్మసాని పిచ్చయ్య యాదవ్, జాయింట్ సెక్రటరీ నంబుల శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.

కలప లోడు లారీ పల్టీ

తప్పిన పెనుప్రమాదం


యద్దనపాడు హైవే వంతెనపై పడిన కలప లోడు లారీ

యద్దనపాడు: కలప లోడు లారీ పల్టీకొట్టింది. పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన హైవేపై సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. పశ్చిమ గోదావరి జిల్లా దోబిచర్ల నుంచి ప్రకాశం జిల్లా ఒంగోలుకు టేకు దుంగల లోడుతో వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై బోల్తా కొట్టింది. లారీ యద్దనపాడు మైదవోలు వెళ్లే అండర్‌పాస్ హైవే వంతెనపై వచ్చేసరికి లారీ ముందుటైరు పంక్చర్ అయింది. వేగంలో ఉన్న లారీ ఒక్కసారిగా కుదుపునకు గురై అదుపు తప్పింది. దీంతో లారీ ఓ వైపునకు వాలడంతో బరువెక్కువై దుంగలన్నీ మోకుల నుంచి జారి హైవేపై పడ్డాయి. ఈ క్రమంలో వంతెన సైడ్ డివైడర్ పక్కనే పడిపోవడంతో లారీపై ఉన్న దుంగలు కొన్ని వంతెనపై నుంచి కింది భాగంలో ఉన్న గ్రామంలోని సర్వీసు మార్గంలోకి వచ్చి పడ్డాయి. విద్యుత్తు స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లు తెగిపోయాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నారు.

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

బాపట్లఅర్బన్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ బాపట్ల జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బాపట్లలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి గుంటూరు జిల్లా అధ్యక్షుడు మునియ్య అధ్యక్షత వహించారు. ఎన్నికల పర్యవేక్షకులుగా నాగరాజు, భాస్కర్ వ్యవహరించారు. కార్యవర్గాన్ని సభ్యుల సూచనలతో ఏకగ్రీవంగా ఆమోదించారు. బాపట్ల జిల్లా అధ్యక్షుడుగా రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా వేముల ప్రసాద్, గౌరవాధ్యక్షుడుగా శ్రీకృష్ణ, కోశాధికారిగా స్వర్ణ అజయ్ ఫణిశర్మ, మహిళ కార్యదర్శిగా సునీత ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జిల్లా ప్రధానకార్యదర్శి ప్రసాద్ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. పండిత మిత్రుల సమస్యలు తీర్చడంలో ముందుంటామని, ఉపాధ్యాయులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల ఉపాధ్యాయులు, యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణానికి దేవతలకు ఆహ్వానం

వైభవంగా గరుత్మంతుని ధ్వజారోహణం


పూజలకు హాజరైన భక్తులు

మంగళగిరి: స్థానిక లక్ష్మీ నృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో అతిప్రధాన ఘట్టమైన ధ్వజారోహణం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఋత్విగరణ, అంకురారోపణాధి కార్యక్రమం నిర్వహించి స్వామి వారి కల్యాణోత్సవానికి భక్త జనులను, దేవతలను ఆహ్వానించేందుకై భక్తాగ్రేసరుడైన గరుత్మంతుని ధ్వజంపై ప్రతిష్ఠించారు. స్వామి వారి సేవలకు, భక్తజన సేవలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కలుగజేసేందుకు దేవతలందరిని వారి వారి విధుల్లో నియమించేందుకు గరుత్మంతుడు ఆహ్వానం పలకడానికి సన్నద్ధమయ్యాడు. అష్ట నాగాధిపతి అయిన గరుత్మంతునికి నివేదన చేసిన ప్రసాదాన్ని గరుడ ముద్దలు అనే పేరుతో పంపిణీ చేశారు. గరుడ ముద్దలు ప్రసాదంగా తీసుకుంటే సంతానం లేని దంపతులు సంతాన వంతులు కాగలరని భక్తుల ప్రగాఢ విశ్వాసం. భారీగా తరలి వచ్చిన భక్తులు గరుడ ముద్దల ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవానికి కైంకర్యపరులుగా మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ వారు వ్యవహరించగా, ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు హనుమంత వాహనంపై నారసింహుడు...

నృసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7 గంటలకు స్వామి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈఓ రామకోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామి వారి ఆశీర్వాదాలు పొందాలని ఆయన కోరారు.